క్లుప్తంగా

నేడు కొల్లిపరలో పంటల సంరక్షణపై రైతు శిక్షణ

కొల్లిపర(తెనాలి): వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వ విద్యాలయం, వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వ్యవసాయ పంటల సంరక్షణ సాంకేతికతలపై రైతు శిక్షణా కార్యక్రమం మండల కేంద్రమైన కొల్లిపరలో జరగనుంది. గ్రామంలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంస్థలో మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటయ్యే శిక్షణ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధు కంపురత్ పి. హాజరు కానున్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ తాతినేని రమేష్‌బాబు అధ్యక్షత వహిస్తారు. విశ్వ విద్యాలయం వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగం సమన్వయకర్త డాక్టర్ హాడోల్ మహేష్ వినాయక్ పర్యవేక్షిస్తారు. కొల్లిపర, వల్లభాపురం, నూతక్కి, కొలకలూరు, వేజండ్ల గ్రామాలకు చెందిన రైతుసోదరులు హాజరై జయప్రదం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ముగిసిన ప్రత్యేక సదరన్ క్యాంప్



తెనాలిఅర్బన్: జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరన్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన క్యాంప్‌లో ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రాటిక్, ఆర్థోపెడిక్ విభాగ వికలాంగులకు పరీక్షలు చేశారు. క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రాటిక్, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన వైద్యులు సేవలు అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



తెనాలిఅర్బన్: భారతీయ మజ్దూర్ సంఘ్ సంస్థను ప్రారంభించి 70 సంవత్సరాలు అయిన నేపథ్యంలో సంస్థ ఇప్పటి వరకు సాధించిన విజయాలను సాధించే కరపత్రాలను శుక్రవారం కొత్తపేటలోని హెడ్ పోస్టాఫీసులో సంఘ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర్‌బాబుకు వినతిపత్రం ఇచ్చి ఉద్యోగుల సమస్యలను తెలియజేశారు. వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి కన్వీనర్ రాజేష్, నాయకులు వెనిగళ్ళ పవన్, వి.కృష్ణయ్య, యార్లగడ్డ నాగరాజు, చందనరావు, ఆశాబీ, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీ శిశుమందిర్ వార్షికోత్సవం

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ కాలనీలో గల శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాల 13వ వార్షికోత్సవం, విద్యార్థుల విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక మేళా శనివారం జరగనుంది. పాఠశాల ప్రాంగణంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి మేళా, సాయంత్రం అయిదు గంటలకు వార్షికోత్సవం జరుగుతుందని పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు అధ్యక్షతన జరిగే సభలో డాక్టర్ వేమూరి శేషగిరిరావు, కుమార్ గ్రూప్ కంపెనీస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, విజయవాడ విద్యాపీఠం కోశాధికారి వేళ్ల నాగేశ్వరరావు, పాఠశాల సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు పాల్గొంటారని వివరించారు.

సంగమేశ్వర స్వామి రథోత్సవానికి వితరణ



తెనాలిటౌన్: రూరల్ మండలం సంగంజాగర్లమూడి గ్రామంలో వేంచేసియున్న సంగమేశ్వరస్వామి దేవస్థానానికి ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి రావి రాంబాబు రూ.11,011 లు విరాళంగా అందజేశారు. మహా శివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 26,27 తేదీల్లో దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామంలో స్వామివారి రథోత్సవం కనులపండువగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం నిమిత్తమే రథోత్సవానికి, అన్నప్రసాదాలకు నగదు విరాళంగా ఇచ్చినట్లు దాతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆళ్ళ మురళిధర్, అర్చకుడు శశికుమార్, రావి కిరణ్‌కుమార్, రావి మణికుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం మైకులు

యూ–టర్న్‌ల వద్ద సమస్యలు పట్టని పోలీసులు

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలో ఎంతో కాలంగా శాశ్వత పరిష్కారానికి నోచుకోకుండా కొరకరాని కొయ్యగా మారింది ట్రాఫిక్ సమస్య. ఇరుకు రోడ్లు.. ఆటోల రద్దీ.. అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌లు వెరసి ఈ సమస్యకు పరిష్కారమే కనిపించనంతగా తయారైంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అనేక చర్యలు చేపడుతున్నామని పోలీసులు చెబుతున్నా పూర్తిస్థాయిలో ఇబ్బందులు మాత్రం తొలగడం లేదు. ఎలాగైనా సమస్య పరిష్కరించాలన్న ఆలోచనతో ఇప్పుడు మరో కొత్త ప్రయోగానికి పోలీసులు శ్రీకారం చుట్టారు. పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, జంక్షన్‌లలో స్తంభాలకు మైకులను ఏర్పాటు చేసి అనౌన్స్‌మెంట్ చేయిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు కలిగి ఉండాలి, ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయొద్దు, మద్యం తాగి



మార్కెట్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన లౌడ్‌స్పీకర్లు

వాహనాలు నడపొద్దంటూ ఇలా ముందుగానే రికార్డింగ్ చేయించిన వాయిస్‌తో మైక్‌లో ప్రచారం చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్నారు. అయితే ఈ కొత్త ప్రయోగం ఎంతకాలం అమలవుతుంది? దీని ద్వారా అయినా సమస్య పరిష్కారం అవుతుందా అన్నది వేచి చూడాలి మరి.

మరో వైపు అధికారుల ఉదాసీనతతో లేక పోలీసుల మాటలంటే ఆటో డ్రైవర్లకు లెక్కలేనితనమో తెలియదు కానీ వాహనదారులకు మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు. తెనాలి-చందోలు రహదారిపై మార్కెట్ వంతెన వద్ద, బస్టాండ్ వంతెన వద్ద యూ–టర్న్‌లు ఏర్పాటు చేశారు. ఫోర్ లేన్ రహదారిగా చెప్పుకుంటున్నా పట్టణపరిధిలో ఈ రహదారులు ఇరుకుగానే ఉంటాయి. ఈ యూ–టర్న్‌ల వద్దే ఆటోలను నిలుపుతున్నారు. ఇక్కడ వాహనాలు యూ–టర్న్ తీసుకునే సమయంలో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా లారీలు, బస్సులు కార్లు వచ్చిన సమయంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలచిపోవాలి వస్తోంది. ఈ ఇబ్బందుల గురించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోంది. వీటన్నింటిపై పోలీసులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఏం చేసింది

కొల్లిపర: రాష్ట్రంలో తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, 50 సంవత్సరాలు వయసు కలిగిన మహిళలకు పింఛన్, జాబ్ క్యాలెండర్ అంటూ కూటమి ఎన్నికల్లో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మహిళలకు, నిరుద్యోగులకు ఇప్పటి వరకు ఏం చేసిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబడిన కె.ఎస్.లక్ష్మణరావుని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తాం అని చెప్పిన హామీలను మహిళలు ఎంతగానో నమ్మి ఓట్లేసిన రాష్ట్ర ప్రజలకు ఈ ప్రభుత్వం తొమ్మిది నెలల పరిపాలనలో ఏం చేసిందో, ఎం అరగబెట్టిందో చెప్పాలని ఆయన కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి ఇప్పుడు మహిళలను, నిరుద్యోగులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు.



ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్న శివసాంబిరెడ్డి

ఇలాంటి అన్యాయాలను ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి అంటే రానున్న పట్టభద్రుల (ఎమ్మెల్సీ)ఎన్నికల్లో కె.ఎస్ లక్ష్మణరావు ను యువత ఓట్లు వేసి ఆయనను శాసనమండలి సభ్యుడిని తిరిగి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో శాసనమండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు , ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ యజమానులు రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్

తెనాలిటౌన్: వ్యవసాయశాఖ రెవెన్యూశాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయభూమి యాజమానుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టినట్లు వెల్లడించారు. మండలంలోని రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ వెంట



తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్ళితే వ్యవసాయ సహాయకులు రైతుకు రిజిస్ట్రేషన్ చేసి యునిక్ నెంబర్ ఇస్తారని తెలియజేశారు. దీనివలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తిస్తాయని వెల్లడించారు. పంట రుణాలు, పంటల భీమా, పంట కొనుగోలు ఇకపై ఈ నెంబర్ ద్వారా మాత్రమే సమర్థవంతంగా అమలు చేయబడతాయని చెప్పారు. రైతులు తప్పని సరిగా రైతు సేవా కేంద్రానికి వెళ్ళి రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మార్కెట్ ఏరియాలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు తెల్లవారుజామునే చెత్తనుతొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మురుగు కాల్వలను కూడా బాగు చేయాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, అధికారులు ఉన్నారు.

108 అంబులెన్స్ రాకుంది..ట్రాక్టరే దిక్కైంది..



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలి గ్రామ శివారులో శుక్రవారం అతివేగంగా ఓ ఆటో వచ్చి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని ఢీ కొట్టింది. ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన వివరాల మేరకు.. కాజ టోల్‌గేట్ వద్ద విధులు నిర్వహించి పెనుమూలి మీదుగా తెనాలి రూరల్ పరిధిలోని కొప్పాల గుడివాడ వెళ్తుండగా.. ఎదురుగా అతివేగంగా వచ్చిన ట్రాలీ ఆటో ద్విచక్ర వాహనంను ఢీకొట్టింది. దీంతో కె.రమేష్ రోడ్డుపై పడిపోయాడు. ఆటో పక్కనే పంటకాలువలోకి దూసుకుపోయింది. రమేష్‌కు కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. ఇతర వాహనదారులు రమేష్ పరిస్థితి గమనించి 108కు సమాచారం అందించారు. గంట సమయం అయినా అంబులెన్స్ రాకపోవడంతో స్థానికులు గాయపడిన రమేష్‌ను ఓ ట్రాక్టర్‌లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టోల్‌గేట్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108కు ఫోన్ చేసినా ఎటువంటి సమాధానం లేదని అందువల్లే రమేష్‌ను ట్రాక్టర్‌లో తీసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి

దుగ్గిరాల: మండల కేంద్రంలో చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలని శుక్రవారం చార్మకార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బుల్లా రాజారావు డిమాండ్ చేశారు. దుగ్గిరాలలో జరిగిన కార్యక్రమంలో రాజారావు మాట్లాడుతూ మండల కేంద్రంలో చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, ఇవ్వాలన్నారు. చర్మకారులు, డప్పు కళాకారులు పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌లను త్వరగా మంజూరు చేయాలని, ప్రత్యేక రుణాలు ఇవ్వాలని తీర్మానించి మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించారు. సెక్రటరీ కె.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ జి.సువర్ణరాజు, ఎం.దైవ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.క్రిష్టఫర్, పి.శ్యాముల్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు సహకరించండి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు అందరూ సహకరించాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి కోరారు. సాలీపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం సతీష్ పాల్ రాజ్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల పెరుగుదలకు నీటి అవాసాలే కారణమన్నారు. దోమలు నీటిలో గుడ్లు పెట్టి వాటి ద్వారా ఉత్పత్తిని పెంచుకుంటాయని తెలిపారు. ఇవి కుట్టడం వలన అనేక వ్యాధులు సోకుతాయని చెప్పారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి ఆవరణలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. మలేరియా అధికారులు అందె బాలచంద్రమౌళి, వంగాల పున్నారెడ్డిలు మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా,



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మెదడువాపు, జీకా వైరస్, బోదకాలు, తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకంఠ ఉమాకాంత్, దీపాల శ్రీనివాసరావు, చింతాల ప్రసన్న పుష్పలత, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం బ్యాంకు ఉద్యోగుల నిరసన

తెనాలి: ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తగినన్ని నియామకాలు చేసి, ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని భారతీయ స్టేట్‌బ్యాంక్ ఎస్‌యూఏసీ, తెనాలి రీజియన్ కార్యదర్శి ఆర్.ప్రేమకుమార్ డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ భారతీయ స్టేట్‌బ్యాంక్ బజార్ బ్రాంచి ఎదుట యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు నిరసన తెలియజేశారు. వారానికి అయిదురోజుల పనిదినాలు, బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చే రాయితీలపై పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా గ్రాడ్యూటీ సవరించి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. తమ సమస్యల సత్వర



బ్యాంకు ఉద్యోగుల నిరసన

పరిష్కారానికై మార్చి 24, 25 తేదీల్లో తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ నాయకులు చంద్రశేఖర్, విశాలాక్షి, తెనాలి బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు సైన్స్ క్విజ్ పోటీలు దోహదం

తెనాలిటౌన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ క్విజ్ పోటీలు దోహదపడతాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శివపార్వతి తెలిపారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. వెజిటేబుల్, ఫ్రూట్ కార్వింగ్, ఫైర్ లెస్ కుకింగ్ అనే అంశాలపై పోటీలు నిర్వహించి ప్రదర్శనలో ఉన్నతంగా రాణించిన విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులకు కుకింగ్ అంశాలపై పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. రకరకాల ఫ్రూట్స్, వెజిటేబుల్స్‌తో విద్యార్థులు అందమైన డిజైనర్లు తయారు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చేసినట్లు వివరించారు. ప్రదర్శనలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిటైర్డ్ బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయినీ ధూళిపాళ్ళ స్వర్ణలత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ అందరి కర్తవ్యం

తెనాలి: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి వర్ధంతిని శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం అధ్యక్షత వహించారు. తెలుగు వ్యవహారిక భాషగా ఆచరణలోకి వచ్చేందుకు గిడుగు రామమూర్తి చేసిన కృషిని వివరించారు. ఆయన బాటలో మాతృభాష తెలుగును కాపాడుకోవటం అందరి కర్తవ్యంగా చెప్పారు. ఉపాధ్యాయుడు, గాయకుడు బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు. సభలో జిల్లా ప్రజానా



మాట్లాడుతున్న దేవరపల్లి నీలాంబ్రం

ట్యమండలి అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, గాయని వీణ, వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. తొలుత గిడుగు రామమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 133 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినీలతో కరస్పాండెంట్ థెరిస్సామ్మ, ప్రిన్సిపల్ షైనీ

తెనాలిఅర్బన్: హైదరాబాద్‌కు చెందిన హీరో మెట్రో గ్రాఫ్, ఫ్యాక్స్ కాన్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో జెఎంజె కళాశాలలో శుక్రవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా సంస్థల ప్రతినిధులు విద్యార్థినీలకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. హీరో మెట్రో గ్రాఫ్ కంపెనీకి 37 మంది, ఫ్యాక్స్ కాన్‌కి 72 మంది ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ తెలిపారు. అలాగే బెంగుళూరుకు చెందిన ఐఎల్ఎం కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 27మంది ఎంపిక చేసి నియామక పత్రాలు పంపినట్లు చెప్పారు. వీరికి ఏడాదికి రూ.2.4 లక్షల వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరిని కళాశాల ఆవరణలో అభినందంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద మేరీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ

తూములూరు (కొల్లిపర): మండల పరిధిలోని తూములూరు గ్రామంలోని హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోర్ల మాణిక్యలరావు(లేటు), కోటేశ్వరమ్మ గార్ల జ్ఞాపకార్థం అల్లుడు యాసరపు వినోద్ కుమార్ బార్య రోజరాణి శుక్రవారం రానున్న పబ్లిక్ పరీక్షలకు కావల్సిన మెటీరియల్స్ అందించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుని మన్నవ జయరత్నరాణి తెలిపారు. దాతలు అందించిన పరీక్ష మెటీరియల్స్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దాతలను ఘనంగా శాలువాతో సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ బొమ్ము



మెటీరియల్స్ అందిస్తున్న వినోద్ కుమార్

భూలక్ష్మి, దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగ సాంబిరెడ్డి, వార్డు మెంబర్ అవుతు సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్‌లోనే విద్యార్థుల జీవితాలు మలుపు

ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ తుమ్మ శశికాంత్

మంగళగిరి టౌన్: విద్యార్థుల జీవితాలను ఇంటర్మీడియట్ విద్య మలుపు తిప్పుతుందని ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ తుమ్మ శశికాంత్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని చింత క్రింది కనకయ్య జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల 53వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్మ శశికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. విద్యార్థి తన భవిష్యత్తు లక్ష్యం, ఏం సాధించాలనుకుంటున్నారో ఆలోచించుకుని దానిని బట్టి ఇంటర్ తరువాత కోర్సులను ఎంపిక చేసుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వ



వార్షికోత్సవాల్లో మాట్లాడుతున్న తుమ్మ శశికాంత్

హించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కళాశాల ప్రెసిడెంట్ చింతిక్రింది కనకయ్య, సెక్రటరి అండ్ కరస్పాండెంట్ గంజి చిరంజీవి, పాలక వర్గం, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా సూచనలతో ప్రమాదాల నివారణ

లాం(తాడికొండ): రహదారి భద్రతా సూచనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తాడికొండ ఎస్ఐ జేత్యా నాయక్, ఈస్ట్ ట్రాఫిక్ జోన్ ఎస్ఐ డి.రవీంద్ర బాబు అన్నారు. లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు రోడ్డు భద్రతా ట్రాఫిక్ రూల్స్‌పై నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రసంగించారు. హెల్మెట్ వాడకం తప్పనిసరి అని సూచించారు. దీనిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో అజాగ్రత్తలు, అప్రమత్తతతో పాటించాల్సిన విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా



అవగాహనా ర్యాలీలో పోలీసులు, కళాశాల విద్యార్థులు

విద్యార్థులకు వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన చేపట్టిన ఎస్‌బీఐ ఉద్యోగులు

మంగళగిరి టౌన్ : మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా 9 బ్యాంక్ ఉద్యోగుల సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడంతో దానిలో భాగంగా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఎస్‌బీఐ ఉద్యోగులు గౌతమ బుద్ధ రోడ్డులోని మెయిన్ బ్రాంచ్ ఎదుట శుక్రవారం విధుల అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ మంగళగిరి మాడ్యూల్ రీజనల్ సెక్రటరి మేగ్యా నాయక్ మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పని, అన్ని విభాగాల్లో ఉద్యోగుల నియామకాలతో పాటు ఇతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో మార్చి 24 నుంచి రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మ్యాన్, ఆఫీసర్ డైరెక్టర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ సమ్మెలో 9 బ్యాంకింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మాడ్యూల్ జోనల్ సెక్రటరి ఏవీ నాగరాజు, బ్యాంచ్ మేనేజర్లు విజయ్, రజనీస్, సుజాత, విష్ణువర్ధన్ రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

హైరిస్క్ గర్భిణుల వివరాలు నమోదు

ఫిరంగిపురం: హైరిస్కు గర్భిణులను గుర్తించి వారి వివరాలను ఆర్సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు వైద్యురాలు శాంతి చెప్పారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 109 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి షుగర్, బీపీ, థైరాయిడ్, గుండెసంబందిత వ్యాధులు ఉన్న గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్య వివరాలు యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ప్రతి నెలా నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో వారికి పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి మందుల అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

